అనుదినం జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 03 ఫిబ్రవరి 2023




## సిర్పూర్(యు) బీఆర్ఎస్ మండలాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**జైనూర్ :** బీఆర్ఎస్ సిర్పూర్(యు) మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోవలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ కోవ అరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉండి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రజలకు మంచి సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్, బీఆర్ఎస్ జైనూర్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, జైనూర్ కోఆప్షన్ సభ్యుడు అఫ్రోచ్‌ఖాన్, బీఆర్ఎస్ యువనాయకుడు మెస్రం అంబాజీ, స్థానిక సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కూసం మారు, బీఆర్ఎస్ నాయకులు పెందూర్ లచ్చు, మోహన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



## టీఏవీఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జిల్లా కేంద్రంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించే తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు విష్ణు పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీఏవీఎస్ ఆదివాసీ విద్యార్థుల సమస్యలపైనే పోరాడుతూనే ఉంటుందన్నారు. మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మ్యాజిక్ షోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పెందూర్ కృష్ణ, చందు, రాజు పాల్గొన్నారు.



# ఎన్నాండ్లీ నిరాశ..!




కాగజ్‌నగర్ - సిర్పూర్ మధ్య రైల్వేట్రాక్‌పై నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జి ఇది. కొన్నేండ్ల క్రితం నిర్మాణం ప్రారంభించినప్పటికీ నిధుల రాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలిపోయింది. దీంతో రోజూ పదుల సంఖ్యలో వెళ్లే రైళ్లతో అటువైపు రాకపోకలు సాగించే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రాకపోకలు సులువుగా మారుతాయని ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నా కేంద్రం పెడచెవిన పెడుతోంది.

- కలగానే ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాలోనూ నిలిచిపోయిన పనులు
- ఈ ఏడాది బడ్జెట్‌లోనూ నిధులు కేటాయింపులో అన్యాయం
- కేంద్ర పద్దుపై ఉమ్మడి జిల్లావాసుల్లో నిరుత్సాహం

**పార్లమెంటులో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక పద్దులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకరు తీవ్ర అన్యాయం జరిగింది. కొత్త పరిశ్రమలు, విద్యాలయాలు కేటాయించకపోగా.. ఉన్నవాటిని సైతం విస్మరించడం జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. తాజా బడ్జెట్‌లో ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైనుకు నిధులు కేటాయిస్తుందని భారీగా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో బీజేపీకి చెందిన ఎంపీ సైతం ఉంటడంతో రైల్వేలైనుకు మోక్షం లభిస్తుందని ఆశపడ్డారు. కానీ తాజా బడ్జెట్‌లో కేంద్రం జిల్లావాసుల వినతులను ఏ మాత్రం పట్టించుకోలేదు. యధావిధిగా వచ్చే సాధారణ నిధులు తప్పితే ప్రత్యేకంగా ఒక్క రూపాయి కేటాయించిన దాఖలాలు కనిపించకపోవడం తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాలోనూ ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో అనేక ఏండ్ల నుంచి ఆ జిల్లావాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరి కొంత కాలం కొనసాగనున్నాయి. ఇక నిర్మల్ జిల్లా కేంద్రానికి రైలు రావడమనేది కలగానే మిగిలిపోతోంది.**




నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పూర్తిగా విస్మరించింది. కేంద్ర పద్దులో ప్రతి ఏటా అన్యాయం జరిగినట్లుగానే ఈ ఏడాది అదే పరిస్థితి కనిపించింది. కానీ ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు..కొత్త ప్రాజెక్టులు ఉంటాయని జిల్లావాసులు భారీగా ఆశలుపెట్టుకున్నారు. సీసీఐ పునరుద్ధరణ, ఏరోడ్రమ్ నిర్మాణంతో పాటు ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైనుకు నిధుల కేటాయింపు ఉంటుందని భావించారు. కానీ తాజా బడ్జెట్‌లో ఏవేమీ కనిపించకపోవడంతో జిల్లావాసులు అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యంగా మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్ జిల్లాలకు కూడా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. 2017లోనే ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌కు సర్వే పూర్తయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించాల్సిన ఈ లైనుపై ఇరు ప్రభుత్వాలు దృష్టిసారించలేకపోతున్నాయి. వాటా విషయంలో ఇరు ప్రభుత్వాలు ఒకరిపైఒకరు నెపం నెట్టుతూ జిల్లావాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి నిత్యం వందలాది మంది హైదరాబాద్ వెళ్తుంటారు. ఆదిలాబాద్ నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ద్వారా రాత్రి వేళలో బయలుదేరితే మహారాష్ట్రకు వెళ్లి ఉదయం రాజధానికి చేరుకుంటుంది. సుమారు 8గంటల సమయం పడుతోంది. కానీ ఆర్మూర్ నుంచి రైల్వేలైను అందుబాటులోకి వస్తే కేవలం 4గంటల్లోనే హైదరాబాదుకు చేరుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రయాణంలో సుమారు 72కిలోమీటర్లు తగ్గిపోతాయి.

**ఆ రెండు జిల్లాలకు అన్యాయమే..!**

కేంద్రం ఆదిలాబాద్, నిర్మల్‌తో పాటు మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు కూడా తీవ్ర అన్యాయం చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి వంతెనను కలుపుతూ మరో వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. హమాలీవాడ వద్ద రైల్వేగేటు మూసి వేసిన సందర్భంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. వీటితో పాటు పలు రైళ్లను నిలుపుదల చేయాలని జిల్లావాసులు అనేక ఏండ్ల నుంచి కోరుతున్నారు. కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలును కాగజ్‌నగర్ వరకు పొడిగించాలని, రేచినిరోడ్, రేపల్లెవాడ స్టేషన్‌లలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. సిర్పూర్(టి) వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. క్యాతన్‌పల్లి వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కానీ కేంద్రప్రభుత్వం వీటిలో ఏ ఒక్క అంశాన్ని పరిగణనలో తీసుకోలేదు. దీంతో అనేక ఏండ్ల నుంచి ఆయా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ కష్టాలు మరింత కాలం కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీకి చెందిన ఎంపీని గెలిపించినా కేంద్రం నుంచి ప్రతి బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం జరుగుతోందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన అడేటి తారకు రూ.25 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బీఆర్ఎస్ నాయకుడు పూదరి వెంకన్న, సత్తతి మారయ్య, శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, ఎంకటి, శంకర్, చిన్నన్న పాల్గొన్నారు.

కౌటాల : మండలంలోని శిర్సా, గుడ్లబోరి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బొమ్మకంటి మనీష్, దనోర్కర్ వసంత్‌రావు, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ వసునూరి తిరుపతి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు డబ్బ బాపు, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

## వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ - వాంకిడి

తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉప్రె కంకేశ్వర్‌కు గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీమొద్దీన్ మాట్లాడుతూ 30 ఏండ్ల నుండి కంకేశ్వర్ చేసిన సేవలను కొనియాడారు. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ఆయన మండల ప్రజలకు సేవలందించడం జరిగిందన్నారు. ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు. మిగతా జీవితంలో కూడా ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, డీలర్లు, సేల్స్‌మెన్‌లు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



నవతెలంగాణ - కౌటాల

చింతలమానెపెల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన 20 మంది ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు వారు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, సర్పంచ్ మౌనీష్, సురేష్, ఎంపీటీసీ మనీష్, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్, వెంకన్న, ఆగయ్య, శైలేష్, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి 11న ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 11న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బి చక్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11-15 గంటల నుండి మధ్యాహ్నం 01-45 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంతో పాటు సెయింట్ క్లారెట్ పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా పరీక్ష హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షకు వచ్చేటప్పుడు కచ్చితంగా హాల్‌టిక్కెట్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## మినీ జాతరకు పోటెత్తిన భక్తులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి సమీపంలో మున్సిపల్ పంప్‌హౌజ్ వద్ద పెద్దవాగు సమీపంలో ఈ నెల ఒకటో తేదీ నుండి నిర్వహిస్తున్న మినీ మేడారం జాతరకు రెండో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. భక్తులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతర కమిటీ అధ్యక్షులు తుమ్మ రమేష్, సభ్యులు పోలోజు శ్రీనివాస్, సీపీ రాజ్‌కుమార్, మంద రాజయ్య, కోట శంకర్, బొమ్మెల శ్రీనివాస్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

## 11న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 11న ఉదయం 11 గంటల నుండి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పనుల స్థాయి కమిటీ, ప్రణాళిక, ఆర్థిక స్థాయి సంఘ సమావేశాలు ఆయా కమిటీ అధ్యక్షుల నేతృత్వంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఈ నెల 7లోగా తమ శాఖ ప్రగతి నివేదికలను 40కాపీల చొప్పున తన కార్యాలయానికి పంపించాలని కోరారు. స్థాయి సంఘా సమావేశానికి సంబంధిత సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కోనప్ప

నవతెలంగాణ - బెజ్జూర్

గొల్లబాయి చెరువు మరమ్మత్తు పనులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్ద సిద్ధాపూర్ శివారులో గల గొల్లబాయి చెరువు మరమ్మత్తులకు ప్రభుత్వం రూ.22.26లక్షలు మంజూరు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే చెరువు మరమ్మత్తులు చేపట్టడం జరిగిందన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలో అన్ని రోడ్లు త్వరలో పూర్తిచేయడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి రోడ్డు వేయడం జరిగిందన్నారు. సలుగుపెల్లి, తుమ్మలగూడ విద్యుత్ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఫోన్‌లో ఆదేశించగా సలుగుపెల్లి, పెంచికల్‌పేట్ విద్యుత్ లైన్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, దీనివల్ల మండల వాసుల విద్యుత్ సమస్య తీరుతుందని తెలిపారు. చిన్నసిద్ధాపూర్ నుండి బెజ్జూర్‌కు త్వరలో రోడ్డు వేయిస్తానని, సోమిని, కృష్ణపెల్లి రోడ్ల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు యువకులకు శిక్షణ ఇప్పించి చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం మండల మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనప్ప, జెడ్పీటీసీ పుష్పలతను శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు కోంద్ర జగ్గాగౌడ్, కౌటాల ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, కాగజ్‌నగర్ నీటిపారుదల శాఖ ఈఈ ప్రభాకర్, డీఈ భద్రయ్య, ఏఈ అజయ్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు భషరత్‌ఖాన్, పెద్ద సిద్ధాపూర్ సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, నాయకులు సతీష్, జావిద్ హుస్సేన్, మహేష్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



## విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ - వాంకిడి

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మండలంలోని తమేళ గ్రామంలోని ఒడ్డెరవాడలో మన ఊరు మన బడి పాఠశాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. నూతనంగా బెంచీలు, ప్రహరీగోడ, వంట గది, అదనపు గదులు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో మన ఊరు మన బడి పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను అందరికి అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మారుతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియామకం

**కాగజ్‌నగర్ :** బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బొమ్మెన శ్రావణ్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ గురువారం ఆయనకు నియామక పత్రం అందించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధోని శ్రీశైలం, ముత్తు అశోక్‌కుమార్, సప్త శ్రీనివాస్ పాల్గొన్నారు.



## నాగోబా దేవాలయ అభివృద్ధికి కృషి

- నూతన ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన నాగోబా దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని కెస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పూజారి మెస్రం షేకు ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో ఆలయ మర్యాదలతో హారతినిచ్చారు. ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం పటేల్ వెంకట్‌రావ్, మాజీ సర్పంచ్ మెస్రం నాగానాథ్ ఆధ్వర్యంలో ఆయనకు నాగోబా మోమెంటోను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగోబా దేవాలయానికి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాబోయే జాతర లోపు వివిధ అభివృద్ధి పనులపై అందించిన నివేదికను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు మేజర్ జీపి ఇంద్రవెల్లిలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ సోము, ఎంపిడిఓ పుష్పలత, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, సర్పంచ్ కొరెంగ గాంధారి, జెడ్పీటీసీ పుష్పలత, నాయకులు అర్క కమ్ము, సిడాం భీంరావ్ పాల్గొన్నారు.

## వార్షికోత్సవం సందర్భంగా ఆటల పోటీలు

నవతెలంగాణ - రెబ్బెన

కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గురువారం వివిధ క్రీడా పోటీలు ప్రారంభించామని ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, టెన్నికాయిట్, రన్నింగ్, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి

- ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్య ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు వివిధ శాఖల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా, మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించే విధంగా సంక్షేమ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కమిటీ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం జరుగుతుందని, జిల్లా స్థాయి కమిటీకి అందిన ఫిర్యాదుల ఆధారంగా సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా ఫిర్యాదుల నివృత్తి అధికారిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని నియమించడం జరిగిందని తెలిపారు. అంతకుముందు ప్రసవ సమయంలో అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై వివిధ సంక్షేమ శాఖల అధికారులు, వైద్య శాఖ అధికారులు శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, ఆర్‌తో రమేష్ రాథోడ్, సంక్షేమ శాఖల అధికారులు మిల్కా, కృష్ణవేణి, రాజలింగం, జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్ సంధ్యారాణి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, సైడ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు పూజలు

- గంగాపూర్ జాతర ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని గంగాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనతరం జాతర ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చేయడం కోసం కొత్త ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు రోజూ వేలాది భక్తులు వస్తారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వారికి ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. గతం కంటే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని, తాగునీరు, పారిశుధ్యం, వసతి సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. భక్తులకు క్యూలైన్‌లు, భారికేడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సింగిల్‌విండో చైర్మన్ సంజీవ్, ఆలయ చైర్మన్ వెంకటేశం చారి, సర్పంచ్ పందిర్ల వినోద మధునయ్య, నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఎంపీటీసీ మధునయ్య, స్టాక్స్ వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## దుకాణంలో రూ.40 వేల నగదు చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో జరుగుతున్న వరుస చోరీలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు బయాందోళనకు గురవుతున్నారు. తాజాగా మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో గల ఓ దుకాణంలో చోరీ బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు, స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం అర్ధరాత్రి దుకాణంలో ఉన్న బీరువాను పగల గొట్టి రూ.40 వేలను దొంగిలించారు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం 10 గంటల సమయంలో షాప్ తీయడానికి వెళ్లగా షాప్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రూ.40 వేల నగదు పోయినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## అంగన్‌వాడీ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాధ



నవతెలంగాణ-కడెం

అంగన్‌వాడీ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాధ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంబారిపేట్ క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడి టీచర్లకు క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాధ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడి టీచర్లు అంగన్‌వాడి కేంద్రం సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం గర్భిణీ మహిళలకు బాలింతలకు పిల్లలకు అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని, మెనూ ప్రకారం అందించాలని అన్నారు. అంగన్‌వాడి కేంద్రం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సమయం పాటించాలన్నారు. అంగన్‌వాడి కేంద్రానికి వచ్చే పిల్లలకు ప్రీ స్కూల్ ద్వారా ఆటపాటలతో బోధన అందించాలన్నారు. ప్రతిరోజు అంగన్‌వాడి కేంద్రం టీచర్ సాయంత్రం నాలుగు గంటల నుండి లబ్ధిదారుల గృహ సందర్శన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## 6న జాబ్, అప్రెంటిస్‌షిప్ మేళా

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 6న జాబ్, అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ సుజాత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎస్ టెలీ సర్వీసెస్ వారు నెట్ వర్క్ ఇంజినీర్ టెక్నీషియన్‌గా పనిచేయడానికి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ ట్రేడులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడానికి కంపెనీ ప్రతినిధులు రానున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు ఎస్‌ఎస్సీ, ఐటీఐ, క్యాస్ట్, ఆధార్, రెండు ఫోటోలు, బయో డేటా ఫార్మ్ రెండు జతల సర్టిఫికెట్‌లు తీసుకొని రావాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఐటీఐ పాసైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**నవతెలంగాణ-బజార్‌హత్నూర్**

మండలంలోని జాతర్ల గ్రామపంచాయతీ పరిధిలోని రామ్‌నగర్ గ్రామంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదేశాల అనుసారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కానిందే రాజరాం రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆత్రం లక్ష్మీభాయి, ఉప సర్పంచ్ అందే సుజాత, ఎంపీటీసీ పెందూర్ ఈశ్వర్, మండల బీసీ సెల్ అధ్యక్షులు అంకుష్, మండల యువజన సంఘం అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయి చైతన్య, నాయకులు నాగోరావు, అందే ప్రకాష్, చట్ల జగదీష్, లక్ష్మీ ఉశన్న, కవిందర్, సురేష్ పాల్గొన్నారు.

## చిరుత దాడిలో లేగదూడ మృత్యువాత



**నవతెలంగాణ-దిలావర్‌పూర్**

మండలంలోని న్యూలోలం గ్రామానికి చెందిన చెంది మోహన్ 3సంవత్సరాల లేగదూడ మేత కొరకు అటవీ ప్రాంతానికి సమీపంలో గల తోటకు వెళ్లగా లేగదూడను చిరుత దాడిచేసి చంపి తిందని రైతులు గురువారం గుర్తించారు. అటవీశాఖ అధికారులకు ఓడ్నం సవిత కృష్ణ సమాచారం అందించగా ఎఫ్‌బీఓ వెన్నెల ఘటన స్థలానికి చేరుకొని చిరుత పులి చంపినట్లు నిర్ధారించారు. కొన్ని నెలల క్రితమే ఒక మేకపై దాడి చేసి, మేకల మందలో అలజడి సృష్టించడం, కాల్వ నరసింహస్వామి ఆలయ సమీపంలో గల కొండపై చిరుత కనిపించడం, కొంత కాలంగా చిరుత సంచారం సమీప తోటలలోని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తగిన చర్యలు చేపట్టి చిరుతను పట్టుకొని తరలించాలని రైతులు కోరుతున్నారు.

## విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి




**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

తెలంగాణ రాష్ట్ర శీతాకాల బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడం సాయి కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వసతి గృహాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ మేడిపండువలే తయారైందని స్కూల్ స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు మౌలిక సదుపాయాలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. స్కూల్, కాలేజీల్లో, గురుకులాల్లో చదివే విద్యార్థులకి విషపూరితమైన భోజనం అందించడం ద్వారా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకి గురవుతున్నారని ఆరోపించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు ఆత్రం వినోద్ కుమార్, జిల్లా నాయకులు కుమ్ర అశోక్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-నిర్మల్**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకటాద్రిపేట్‌లో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. వైద్య శిబిరంలో సౌకర్యాలు, ఏర్పాట్ల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కట్టుదిట్టమైన ప్రణాళికతో కంటి వెలుగును ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కంటి సమస్యతో బాధ పడుతున్న వారికి కండ్ల అద్దాలు అందేలా చూడాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించాలని అన్నారు. అవసరమైన మందులు అందించాలన్నారు. పట్టణంలోని 42వ వార్డుల్లో దశల వారిగా కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్కాకుల నరహరి, మాజీ కౌన్సిలర్ మంగ్లారపు పొశెట్టి, బొజ్జ సుదర్శన్, చుక్క సహదేవ్, మంగ్లారపు బాపురావ్, కూన పొశెట్టి, కూన ప్రసాద్, సానిటరి ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, కాలనీ వాసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి వెలుగు శిబిరం తనిఖీ

**నవతెలంగాణ-లోకేశ్వరం**

మండల కేంద్రంలోని హవర్గ గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం జిల్లా నూతన కలెక్టర్ వరుణ్‌రెడ్డి తనిఖీ నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య, వారి ఆరోగ్య సమస్యల గురించి, ఎక్కువగా ఏ వయస్సు వారు ఉంటున్నారని వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు శిబిరాల వద్ద అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. శిబిరాలకు వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాలలో 18 ఏండ్లు పైబడిన వారందరికీ కంటి పరీక్షలు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ సల్మాన్ రాజ్, గ్రామ సర్పంచు భుజంగరావు, ఆశ కార్యకర్తలు, మెడికల్ సిబ్బంది, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మూడు రోజుల పాటు ఉచితశిక్షణ

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

7 నుంచి 9వ తేది వరకు ఆదిలాబాద్ యూత్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో యువత నాయకత్వం అభివృద్ధిపై జిల్లా యువతీ, యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్టు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి సుశీల్ బాడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ 3 రోజుల పాటు అనుభవజ్ఞులైన వక్తల ద్వారా యువతకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశ్యం యువకులకు వ్యక్తిత్వ వికాస శిక్షణను అందించడమని తెలిపారు. వారు తమ స్వయం ఉత్తమ సంస్కరణను చేరుకోవడానికి వీలు కల్పించడం, ప్రాథమిక జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడానికి వ్యక్తుల మధ్య నైపుణ్యాలు వంటి వాటి గురించి శిక్షణ ఉంటుందని తెలిపారు. అలాగే సమాజాభివృద్ధి, స్వచ్ఛంద సేవ, సామాజిక నిబద్ధత దేశభక్తి విలువలపై పాల్గొనే యువతలో అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. కెరీర్ ప్లానింగ్, గోల్ సెట్టింగ్, స్వీయ క్రమశిక్షణ సాధన, ప్రథమ చికిత్స వంటి అత్యవసర నైపుణ్యాలు, విపత్తు ప్రతిస్పందన చేయాల్సినవి, చేయకూడనివి మొదలైన వాటిపై ప్రాథమిక శిక్షణను అందించడం జరుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే యువతీ, యువకులకు 3 రోజుల పాటు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ శిక్షణ కేవలం 40 మందికి ఉంటుందని, ఉత్సాహంగా ఉన్న యువతీ, యువకులు టీచర్స్ కాలనీ, ఇమాం అలీ బిల్డింగ్ దగ్గరలో ఉన్న నెహ్రూ యువజన కేంద్రం, కార్యాలయంలో గాని లేదా మొబైల్ నెంబర్. 9618174338ని సంప్రదించాల్సిందిగా కోరారు.

# ఆశాల సమస్యలు చర్చించి, పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

**నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్**

నేటి నుంచి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యలను చర్చించి, పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని పీహెచ్‌సీల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ మేరకు గురువారం ఖుర్షీద్‌నగర్‌లోని పీహెచ్‌సీ ఎదుట చేపట్టిన ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 26వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని అన్నారు. గత 18 సంవత్సరాల నుండి రాష్ట్రంలోని పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వారంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని అన్నారు. పారితోషికాల పనితో పాటు పారితోషికాలు లేని అనేక అదనపు పనులు, ఆశలు చేస్తున్నారని తెలిపారు. కంటి వెలుగు, లెప్రసీ తదితర ప్రభుత్వం నిర్ణయించిన అన్ని పనులు ఆశాలు చేస్తున్నారని అన్నారు. ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి వరకు ఆశాలు తమ విధులను నిర్వర్తిస్తున్నారని వివరించారు. పని భారం గతంతో పోలిస్తే అనేక రెట్లు పెరిగిందని అన్నారు. పెరిగిన పనులను చేస్తున్నప్పటికీ ఆశాలకు నేటికీ నిర్ణిత వేతనం చెల్లించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఆశలకు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ప్రసూతి సెలవుల కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనం అందించాలని 106 రోజుల పాటు ఆశాలు చేసిన సమ్మెను గురించి గుర్తు చేశారు. ప్రగతి భవన్‌లో ఆశలతో నిర్వహించిన సమావేశంలో ఆరువేల రూపాయల నిర్ణిత వేతనం చెల్లిస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని అన్నారు. అలా ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించి, పాత పద్ధతిలోనే పారితోషికాలు చెల్లిస్తోందని విచారం వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో చెల్లిస్తున్న విధంగా రూ.10వేలు నిర్ణిత వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ 26వేలు చెల్లించాలని పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత



కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాలు 2022 డిసెంబర్ 6 నుండి నిర్వహించిన లెప్రసీ సర్వేతో పాటు ఈనెల 18 నుండి చేపట్టిన కంటి వెలుగు పనికి కూడా అదనంగా అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. టీబి స్యూటమ్ డబ్బాలను ఆశాలతో మోపించే పనిని రద్దు చేయాలని, ఆశలకు పని భారం తగ్గించాలని సూచించారు. జాబ్ చార్టును విడుదల చేయాలని అన్నారు. 2021 జులై నుండి డిసెంబర్ వరకు గల ఆరు నెలల పీఆర్సీ, ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. 32 రకాల రిజిస్టర్ లను ప్రభుత్వమే సప్లై చేయాలన్నారు. అలాగే ఆశలు వాటికోసం చేసిన వ్యయాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రుల్లో ఆశాలకు విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యతతో కూడిన ఐదు సంవత్సరాల పెండింగ్ యూనిఫామ్‌లను వెంటనే అందించి, అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. ఆశల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, నాయకులు లక్ష్మి, పుష్ప, స్వప్న, సంగీత, అర్చన, దీక్ష పాల్గొన్నారు.

# కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



**నవతెలంగాణ-ఇంద్రవెల్లి**

కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన పక్షంలో రీడింగ్ కండ్లాద్దాలు, ప్రిస్క్రిప్షెడ్ అద్దాలను సిఫారసు చేయాలనీ వైద్యులకు సూచించారు. ఏ ఒక్కరూ కూడా మిగలకుండా, అర్హత గల వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించే విధంగా ప్రతి వాడవాడల తిరిగి అవగాహన కల్పించాలని అన్నారు. ఆశలు, ఏఎన్ఎంలు, వారి పరిధిలో ఉన్న గృహాల కుటుంబాల వారికి వివరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించిన వివరాలను యాప్‌లో పొందుపరచాలని అన్నారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కేస్లాపూర్ నాగోబా దేవాలయంలో కలెక్టర్ ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ పీఠాధిపతి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు శాలువాతో సన్మానించి, నాగదేవత చిత్రపటాన్ని అందించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నానని, మెస్రం వంశీయులు పోగు చేసిన సొమ్ముతో దేవాలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. మున్ముందు దేవాలయం పరిధిలో చేపట్టాల్సిన పనులపై మరోసారి సందర్శించి సమావేశం ఏర్పాటు చేసి తెలుసుకుంటానని దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, తహసీల్దార్ సోము, ఎంపీడీఓ పుష్పలత, సర్పంచులు రేణుక, గాంధారి, ఆలయ పీఠాధిపతి, ఆలయ ఈఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసీడీ చార్జీల పేరుతో ప్రజలను వేధించడం సరికాదు

- ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**నవతెలంగాణ-నిర్మల్**

ఏసీడీ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులను వేధించడం సరికాదని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏసీడీ చార్జీలకు నిరసనగా విద్యుత్ శాఖ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మార్గ మధ్యలో ధర్మసాగర్ చెరువు మినీ ట్యాంక్ బ్యాండ్ మీద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వేస్తున్న విద్యుత్ అదనపు బిల్లులు, ఛార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. వెంటనే ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని తొలగించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్నదాతలను నిండా ముంచుతోందని విమర్శించారు. 2014, 2018లో రైతులకు కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించారని అన్నారు. వెంటనే హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం నిలబడదని అన్నారు. విద్యుత్ అదనపు భారాన్ని తగ్గించాలని, రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేని



పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ జెడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, నాందేడపు చిన్ను, గంగాధర్, జమాల్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# 24గంటలు కరెంట్ ఇవ్వాలని రైతుల రాస్తారోకో

**నవతెలంగాణ-కుభీర్**

వ్యవసాయానికి 24గంటల పాటు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం వద్ద మండల రైతులు రాస్తారోకో చేసి ధర్నా చేపట్టారు. రైతుల ధర్నాకు నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు పి.రమాదేవి రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రైతులకు విద్యుత్ ఏ టైంకు ఇస్తున్నారో తెలవడం లేదని అన్నారు. దీనివల్ల రైతులు 24 గంటలు పడిగాపులు కాయాల్సి వస్తుందని, వెంటనే సమయాన్ని పాటించి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి 24 గంటలు కరెంటు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు, వ్యవసాయానికి 24గంటలు కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రైతులు గంటకు పైగా ధర్నా చేయడంతో రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారి అక్కడికి చేరుకొని రైతులకు 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో విద్యుత్ శాఖ అధికారి 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని తెలపడంతో రైతులు ధర్నా విరమించారు.



## గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి ఏమాత్రమూ దోహదపడని కేంద్ర బడ్జెట్

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఏమాత్రం దోహదిపడేదిగా లేదని, ప్రతి ఏడాది మోసం చేసినట్లుగానే ఈ ఏడాది కూడా అంకెల గారడితో మోసం చేసిందని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం పట్ల పూర్తిగా విస్మరిస్తూ వస్తుందనడానికి బడ్జెట్‌లో కేటాయిస్తూవస్తున్న నిధులే అందుకు నిదర్శనమని అన్నారు. వచ్చే జనరల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనైనా ఈ ఏడాది బడ్జెట్ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచుతుందని ఆశించామని అన్నారు. రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధికి కేటాయించిందని పేర్కొన్నారు. దేశంలో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం ప్రతి ఏటా కేటాయిస్తున్న గిరిజన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పద్దు కింద గత ఏడాది 102 శాఖలకు గాను రివైజ్డ్ బడ్జెట్‌లో రూ.94,292 వేల కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే పెంచి రూ.1,19,509 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. ఇందులో గిరిజన సంక్షేమశాఖకు కేవలం రూ.2166 కోట్లు మాత్రమే కేటాయించడం విస్మయానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన రూ.25 వేల కోట్లు కూడా గిరిజనుల అభివృద్ధికి ఉపయోగపడే వాటిలో పెంచకుండా గిరిజనులకు ఏమాత్రం ఉపయోగపడని ఇతర శాఖలో పెంచడం అన్యాయమని తెలిపారు. ఈ నిధులతో దేశంలో గిరిజన అభివృద్ధి, సంక్షేమం ఏ విధంగా చేస్తారో కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన గిరిజన జనాభా నిష్పత్తి 10 శాతం ప్రకారం కేటాయించడంలో కూడా తీవ్రమైన అన్యాయం చేసిందని అన్నారు. విభజన చట్టంలో భాగంగా ఏర్పాటు చేస్తామన్న రెండు రాష్ట్రాల గిరిజన యూనివర్సిటీలకు కలిపి కేవలం కోటి రూపాయలు మాత్రమే కేటాయించి, ద్రోహం చేసిందని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందని వేలాది మంది గిరిజన విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిందని అన్నారు. గిరిజన విద్యార్థులకు ఇస్తున్న ఫెలోషిప్ కింద రూ.119 కోట్లు తగ్గించి కేవలం రూ.145 కోట్లు మాత్రమే కేటాయించడం గిరిజన విద్యపట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాల కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కేటాయించిన నిధుల నుండి వేలకోట్లు ఇతర పథకాలకు దారి మళ్లించిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సబ్ ప్లాన్ స్ఫూర్తికి విరుద్ధంగా నిధులను కేటాయించడంతో పాటు పూర్తిగా నీరుగార్చే విధంగా వ్యవహరించిందని అన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ రాజ్‌ను గురువారం టీఎన్జీఓస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఏ నవీన్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీజ, టీఎన్జీఓస్ జిల్లా కమిటీ సభ్యులు తిరుమల్ రెడ్డి, గోపి, ఓం ప్రసాద్, నారాయణ, రాజేశ్వర్, చంద్రశేఖర్ ఆదిలాబాద్ యూనిట్ అధ్యక్షులు మహేందర్, దత్తు, వసతి గృహ అధికారుల అధ్యక్షులు జె.నర్సింలు, నయీం, సంజయ్ పాల్గొన్నారు.

## బంగారు తెలంగాణ అంటూ మోసం

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

బంగారు తెలంగాణ అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసి, ఆర్థికంగా అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణను, అప్పుల తెలంగాణాగా మార్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా రిమ్స్ ఎదుట చేపడుతున్న నర్సుల నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉందని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి రోగులకు సేవలు చేసిన వైద్య రంగంలో కీలక పాత్ర అయిన నర్సులకు గత 8 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకోవడం వారిని వంచనకు గురిచేయడమేనని అన్నారు. వెంటనే నర్సుల వేతనాలు చెల్లించక పోతే బీజేపీ ఆధ్వర్యంలో పట్టణ దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలా మున్న, జోగు రవి, దినేష్ మటోలియ, ముకుంద్, మయూర్ చంద్ర, సిద్దు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలో నిరుద్యోగత ఎక్కువ

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అక్షరాస్యుల కంటే నిరక్షరాస్యతనే ఎక్కువైందని, నిరుద్యోగులు పెరిగి పోయారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రణదివేనగర్‌కు చెందిన సాయి, కపిల్‌తో పాటు పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాషాయ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బతుకులు బాగుపడతాయని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే తొమ్మిదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకుల బతుకులే మాత్రం మారాయని ఆరోపించారు. టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మారిస్తే సరిపోదని తెలంగాణ ప్రజల బతుకులు కూడా మారాలని అన్నారు. పార్టీలో చేరిన యువతకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు లాలామున్న, నాయకులు దినేష్ మాటోలియా, జోగురవి, వేదవ్యాస్ శ్రీనివాస్, రాకేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**నవతెలంగాణ-బోథ్**

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి రామాయి సదానందం తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్, అలాగే నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ, వేరు వేరుగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు జాదవ్ రోహిదాస్, రాథోడ్ సుదర్శన్, జాదవ్ బాబూలాల్, డాక్టర్ స్వామి, సుధీర్ రెడ్డి, ఈశ్వర్, దేవిదాస్, సింగం హరి, రామాయి శంకర్ ఉన్నారు.

## ఉపాధి హామీ చట్టం అమలు దినోత్సవం

**నవతెలంగాణ-బోథ్**

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం అమలు దినోత్సవాన్ని పురస్కరించుకొని డీపీఓ శ్రీనివాస్, ఎంపీపీ తుల శ్రీనివాస్, కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ప్రతి కార్మికుడు పనులు చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణ్, ఎంపీఓ జీవన్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండారు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## అడవి పందుల దాడిలో పంటనష్టం

**నవతెలంగాణ-దిలావర్‌పూర్**

అడవి పందుల దాడిలో చేతి కొచ్చిన మొక్కజొన్న పంట నేలపాలయ్యింది. దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రైతు మార్గం ఇస్తారి రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట వేశాడు. పంట ఏపుగా పెరిగి మొక్క జొన్న కంకులు అవుతున్న క్రమంలో ఒక ఎకరం మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. తోటకు వెళ్లి మొక్కజొన్న చూసిన రైతు ఖంగు తిన్నాడు. జరిగిన అపార నష్టానికి తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

## హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ప్రత్యేక బస్సు

**అదిలాబాద్‌టౌన్ :** వ్యాపారస్తులు, వైద్యం నిమిత్తం కొరకు హైదరాబాద్ వెళ్లే వాళ్లకు అదిలాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నుండి ప్రతిరోజు ఉదయం 3:30 గంటలకు సికింద్రాబాద్ వరకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయబడినట్లు డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సర్వీసు శుక్రవారం నుండి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉదయం 03:30 గంటలకు బయలుదేరి ఉ 9:30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

## అటవీశాఖకు భారీగా ఆదాయం

**ఇచ్చోడ :** అటవీ శాఖ ఇచ్చోడ రేంజ్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించగా, భారీగా ఆదాయం సమకూరింది. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ పాండు రంగు తెలిపిన వివరాల ప్రకారం... ఇచ్చోడ రేంజ్ పరిధిలో 198 వాహనాలకు వేలం వేయగా అందులో 144 వాహనాలు వేలంలో అమ్ముడుపోయాయని వాటికి సుమారు రూ.45లక్షల 40 వేలు వచ్చినట్లు తెలిపారు. మిగతా వాటికి మరో సారి వేలం వేయునునట్లు పేర్కొన్నారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని పిన్నారం గ్రామంలో గురువారం హనుమంత్‌రావ్, డా.రాజేష్ అధ్వర్యంలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ఎంపీపీ సురేఖ, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ హాజరయ్యారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత క్రీడలలో రాణించాలని అన్నారు. యువత క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఒత్తిడిని జయిస్తారుని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర నైపుణ్యాలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నదని పేర్కొన్నారు. ఇటీవలే ప్రభుత్వం క్రీడల నిర్వహణ కోసం నిధులను విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేది నుండి 4 వరకు క్రీడా పోటీలు జరుగుతాయని, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ సెక్రటరీ, పీఈటీలు పిన్నారం నాయకులు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మున్నూరుకాపు సంఘం జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మిట్ట వెంకన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా గజ్జి రామయ్య, అధ్యక్షులుగా మిట్ట వెంకన్న, ప్రధానకార్యదర్శిగా ఎమ్మాజీ సంతోష్, కోశాధికారిగా చిట్ల నారాయణ, ఉపాధ్యక్షులుగా బొల్లం వెంకన్న, పుప్పాల శ్రీనివాస్, జాయింట్ సెక్రెటర్‌గా దేవరనేని రమేష్, తోట మహేష్, సెక్రెటరీగా బుర్ర మధుకర్, బండి మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా మెకార్తి శ్రీనివాస్, బొమ్మెళ కిషన్, సలహదారులుగా మరిశెట్టి రమేష్, తాటి రామచందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు గడ్డల సురేష్, సదాశివ, వెంకటేష్, మిట్ట తిరుపతి, దేవేందర్, జక్కయ్య పాల్గొన్నారు.

## జాబ్ చార్ట్ అనుసరిస్తూ విధులు బహిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో తమను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ జిల్లాలోని హిందీ పండితులు బుధవారం నుంచి తమ జాబ్ చార్ట్ అనుసరిస్తూ విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాధికారి అశోక్‌కు పండిత జేఏసీ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల పదోన్నతులు భాషా పండితులను పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణం అన్నారు దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భాష పండితులకు న్యాయం జరిగే వరకూ తొమ్మిది పది తరగతులకు విద్య బోధన చేయబోమన్నారు. జాబ్ చార్ట్ ప్రకారం తాము వ్యవహరిస్తామని ప్రత్యేక అలవెన్స్‌గా ఇచ్చే రూ.150 తిరస్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పండిత జేఏసీ నాయకులు హేమంత్ షిండే, రాజేందర్, జైవంత్‌రావు, నీరజ్, యశ్వంత్‌రావు, శిల్పా, సరోజ, శంకర్ పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్‌జోన్‌లో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ రేంజి పరిధిలోని గోండుగూడ అడవిలో గురువారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు, కలమడుగులోని జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను గొండుగూడగుడా అడవిలో విద్యార్థులకు చిత్తడి నేలలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎఫ్డిఓ మాధవరావు వ్యాచారచన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అడవిలో చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవిలోని మృత్తికలు, ప్రకృతి, చిత్తడి నేలల స్వభావం వాటి గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్, డిఆర్ఓ సతీష్ ఎఫ్ఎస్ఓలు ఎఫ్బీఓలు, పాఠశాల ఉపాధ్యాయులు కొంద్రు జనార్ధన్ ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, రామ్‌రెడ్డి, నగేష్ ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

నవతెలంగాణ- కాసిపేట

తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ చెక్కులను 58 మంది లబ్ధిదారులకు అందజేశారు. గట్రావుపల్లిలో రూ.7.60 లక్షలతో సబ్ సెంటర్ నిర్మాణ పనులకు, సోనాపూర్ పంచాయతీలోని బాదుగూడలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, రొట్టెపల్లి గ్రామ పంప్‌హౌస్ వద్ద కుంరంభీం విగ్రహ ప్రతిష్టాపణ కార్యక్రమాన్ని భూమి పూజ చేసి ప్రారంభించారు. పల్లంగూడ ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి కింద రూ.23 లక్షలతో నూతనంగా చేపట్టిన నిర్మాణాలను ప్రారంభించారు. గట్రావుపల్లి, సోనాపూర్ దారి మధ్యలో ఉన్న వంతెన పగుళ్ల తేలడంతో వెంతనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ. జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీడీఓ ఎంపి అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, సహకార చైర్మన్ నీలా, ఎంపీటీసీ రాంచందర్, సర్పంచ్‌లు బాదు, రాంటింకి శ్రీనివాస్, కవిత, ఆడె జంగు, స్వప్న, సంపత్ నాయక్, విజయ, పెంద్రం రాజు, సుశీల, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి యాదవ్, రైతు సమితి అధ్యక్షుడు దుర్గం పోశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, కోఆప్షన్ సిరాజ్ ఖాన్, ఎంపీఓ నాగరాజు, పెంద్రం హన్మంతు పాల్గొన్నారు.

## కంటి వెలుగు పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని ఒత్కులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్య అధికారి డాక్టర్ సుబ్బారాయుడు పరిశీలించారు. అనంతరం రోజుకి ఎంతమంది పరీక్షలు చేయించుకుంటూన్నారో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని అన్నారు కంటి సమస్య ఎక్కువగా ఉన్న వారిని ఆసుపత్రికి రిఫర్ చేయాలని సూచించారు. పరీక్షల కోసం వచ్చిన వ్యక్తులకు సరైన వసతులపై అరా తీశారు. వైద్యం కోసం వచ్చిన వారికి సరైన వసతులు కల్పించే విధంగా సిబ్బంది తగు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఆయన వెంట అంగ్రజపల్లి పీహెచ్‌సీ వైద్యులు ముస్తఫా, హెచ్ఈఓ జగదీష్, పంచాయితీ కార్యదర్శి జాన్, ఏఎన్ఎంలు రాజమణి, హరిత, భాగ్యలక్ష్మి, అప్తమలజిస్ట్ నజీర్, డీఓ సంపత్ ఉన్నారు.

## భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో తమ సంఘ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్ణ గౌడ్ కోరారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ఎమ్మెల్యే, ఎమ్మెల్యే ఆత్రం సక్కులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు సరిపోయేంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి అవసరమైన నిధులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ యూనిట్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి మధుసూదన్ గౌడ్, కోశాధికారి కిష్టయ్య, సహ అధ్యక్షుడు అచ్యుతరావు, ఉపాధ్యక్షులు పద్మ, నాయకులు గౌరమ్మ సుగుణాకర్, పెంటయ్య, శ్యామ్ రావు, పోచయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో

# ఆశా కార్యకర్తల సమస్యలు చర్చించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్





నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు గురువారం కాగజ్‌నగర్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కంటి వెలుగు, లెప్రసీ తదితర ప్రభుత్వం నిర్ణయించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశాల పాత్ర కీలకమన్నారు. పనిభారం పెరిగినా నేటికీ ఫిక్సిడ్ వేతనం లేదని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. గతంలో 106 రోజుల సమ్మె అనంతరం ప్రగతి భవన్‌లో ఆశాలతో సమావేశం ఏర్పాటు చేసిన సీఎం రూ.6 వేల ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయకుండా ఆశాలను మోసం చేస్తోందన్నారు. మళ్లీ పాత పద్ధతిలోనే పారితోషికాలు చెల్లిస్తోందని, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, డిసెంబర్ 6 నుండి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరి 18 నుండి నిర్వహించిన కంటి వెలుగు పనికి అదనంగా డబ్బులు చెల్లించాలని, ఆశాలకు పని భారం తగ్గించి జాబ్ చార్టును విడుదల చేయాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్ అశ్వినికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నగరం పద్మ, జిల్లా కమిటి సభ్యులు పంచశీల, దుర్గం అనిత, మాదవి, మండలి, సప్న, లక్ష్మి, భాగ్య, జెల్పన, మీనతి పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్:** తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలను రూ.26000 నిర్ణయించి ఇవ్వాలని, ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గతంలో నిర్వహించిన లెప్రసి, కంటి వెలుగు సర్వేలకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఏఎన్ఎంకు వినతి పత్రం అందజేశారు.



# బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యం 750 లక్షల టన్నులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ ఎన్.శ్రీధర్





నవతెలంగాణ-జైపూర్

2023-24 ఆర్థిక సంవత్సరంలో 750 లక్షల టన్నుల నిర్దేషిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యంత కీలకమైన చివరి మూడు నెలల్లో గరిష్ట స్థాయి బొగ్గు ఉత్పత్తి, రవాణా కొనసాగడం సంతోషమని పేర్కొన్నారు. గురువారం సింగరేణి వ్యాప్త డైరెక్టర్లు, అడ్వైజర్లతో పాటు ఏరియా జీఎంలతో ఉత్పత్తి లక్ష్యాలపై సమిక్ష నిర్వహించారు. ఇక నుంచి రోజు వారి ఉత్పత్తి లక్ష్యం 2.3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణా తప్పనిసరిగా కొనసాగించాలని సూచించారు. ఇదే ఒవరడి నెలాకరు వరకు కొనసాగించాలని దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తితో పాటు ఒవర్ బర్డెన్ తొలగింపు కూడా 17 లక్షల క్యూబిక్ మీటర్లు దాటించేందకు కృషి చేస్తూ.. వచ్చే వర్షాకాలం వరకు ఇదే స్థాయిలో ఓబీ తొలగింపు కొనసాగించాలని సూచించారు. ఈ లక్ష్య సాధనకు కృషిచేస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్దేషించుకున్న 750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా లక్ష్యాలను సాకారం చేసుకోగలమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాదిలో ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాకు, కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓపస్‌కాస్ట్ నుండి కనీసం 80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేసిన ఆయన వచ్చే ఏడాదిలో ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడం కోసం ఇది దోహదపడుతోందని పేర్కొన్నారు. కొత్త ప్రాజెక్టులు, విస్తరణ గనులకు సంబంధించి భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు సహాయ సహకారం అందిస్తున్నారని, సంస్థ డైరెక్టర్లు నిరంతరాయంగా జిల్లా అధికారులతో సంప్రదింపుల ద్వార అనేక సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఏరియాల జీఎంలు కూడా సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఇతర ప్రభుత్వ శాఖల వారిగా అధికారులను కలుస్తూ ఇంకా మిగిలివున్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

# వైభవంగా గూడెం స్వామి కల్యాణం మహోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దండేపల్లి



తెలుగు రాష్ట్రాల్లో రెండవ అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన గూడెం గుట్ట శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం వైభంగా నిర్వహించారు. మేళా తాలలతో వేద పండితుల మత్రోచ్ఛరణల మధ్య స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గోధులిక సుముహూర్తన స్వామి వారి కళ్యాణ మహోత్సవం చూడ ముచ్చటగా జరిగింది. మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ మోటపలుకుల గురువయ్య, ఆలయ నిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, ముఖ్య అర్చకులు గోవర్ధన రఘు స్వామి, అర్చకులు సంపత్ స్వామి, ఆంజనేయ స్వామి, సురేష్ స్వామి, నారాయణ శర్మ పాల్గొన్నారు.

# మద్దతు ధర కల్పించాలని 6న జిల్లా బంద్





నవతెలంగాణ-ఆసిఫాబాద్

పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్‌తో ఈనెల 6వ తేదీన నిర్వహించ తలపెట్టిన జిల్లా బంద్ విజయవంతం చేయాలని ఎంఎస్పి జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్‌లు కోరారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంట దిగుబడి లేకపోవడంతో రైతులు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంట చేతికి వచ్చిన తర్వాత ప్రభుత్వాలు పట్టింపు లేని తనంతో వ్యవహరించడంతో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటాల్ ధర రూ.15000 నిర్ణయించుకుంటే జిల్లా బంధుతో ఆపకుండా భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. దీనిలో భాగంగా 2వ దశలో ఎడ్ల బండ్లతో సడక్ బంద్ నిర్వహిస్తామని, 3వ దశలో వారం రోజులపాటు రైతులతో నిరసన దీక్ష చేస్తామని, 4వ దశలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని, అప్పటికీ కేంద్రం స్పందించకుంటే 5వ దశలో రైలు రోకోలు చేపడతామని తెలిపారు. నాయకులు ప్రభుత్వాల దృష్టికి సమస్య తీవ్రతను తీసుకువెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండలాల వారీగా బందు విజయవంతం చేయడానికి రైతులు పెద్ద ఎత్తున కదిలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం, బీసీ రైతు సంఘం అధ్యక్షుడు వైరగడే మారుతి, బంజారా నాయకులు బానోత్ గోపాల్ నాయక్, వివిధ సంఘాల నాయకులు బోర్కుటే తిరుపతి, సోయం చిన్నయ్య, చాపిడి సురేష్, రమేష్, ప్రభాకర్, బిక్కాజీ, మిట్ట పోషన్న, నాగపురి మారుతి, ఆవిడపు ప్రణయ్ పాల్గొన్నారు.

# కేజీబీవీ బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కేజీబీవీ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భవాని డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతితో కలిసి ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా గాంధీ పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించిన్నప్పటికీ వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. దీనితో అతి తక్కువ వేతనాలతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సి కమిషన్ సూచన మేరకు కనీస వేతనం రూ.19000 అమలు చేయాలని జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ జీఓ ప్రకారం కేటగిరి మొదటి రూ.15600, రెండవ రూ.19500, మూడవ కేటగిరికి రూ.22750 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని ఆ దిశగా రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ విషయాన్ని చర్చకు తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ సంఘం నాయకురాలు సౌజన్య, శోభ పాల్గొన్నారు.

## ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసీ గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీఓ కోట్నాక భీంరావు అన్నారు. గురువారం మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీ గోండ్‌గూడ గిరిజన గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కన్వీనర్ ఎస్‌కే అబ్దుల్లా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులు పోడు చేసుకుని సాగు చేసుకుంటున్నా భూములకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివాసి గిరిజనులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సందర్భంగా ఉట్నూర్ ఐటీడీఏ ఏపీఓ కోట్నాక భీంరావు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, తొడసం హేమలత, గిరిజాబాయి, పెంద్రం శకుంతల, హజియా బేగం వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి కాణిపాకం అశోక్ నాయకులు కూకటికారి బుచ్చయ్య కొండ గొర్ల లింగన్న పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించి ఆదిలాబాద్‌కు బదిలీ అయిన కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఆయనను సన్మానించారు. రెండు సంవత్సరాలు జరిగిన పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆలీ బిన్ అహ్మద్, మైనారిటీ నాయకులు నిసార్, అబ్దుల్లా, రామ గౌడ్ పాల్గొన్నారు.

## దళితబంధు అర్హులకు వర్తింపజేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దళితబంధు పథకం అర్హులకు అందజేయాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మన ధర్మయ్య కోరారు, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్‌కు దళిత బంధుకు సంబంధించిన దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు అర్హులకు వచ్చినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆ దిశగా నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తిర్యాని మండల అధ్యక్షులు మల్లెల అశోక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దెల మొగిలి పాల్గొన్నారు.

## నేటి నుంచి గాంధారి మైసమ్మ జాతర

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



రామకృష్ణాపూర్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని శుక్రవారం గాంధారి మైసమ్మ జాతర ప్రారంభం కానుంది. ఈ జాతర మూడు రోజుల పాటు ఆదివాసుల సంప్రదాయల సంస్కృతి సాంప్రదాయాలతో వైభవంగా నిర్వహిస్తారు. జాతరలో కోయమేకాశిలు పూజారులుగా వ్యవహరిస్తారు. స్థానిక కోయ, మెస్రెలు, గోండు, నాయక్‌పోడ్ వంశస్థులు మహారాష్ట్ర, చతిషగడ్ నుంచి వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజున భీమన్న దేవతామూర్తులను గోదావరిలో స్నానాలు ఆచరించి, పూజలు నిర్వహిస్తారు. రెండో రోజు బైరవునికి నైవేద్యం సమర్పించి మైసమ్మ కొలువయిన ప్రదేశంలో డప్పు చప్పుళ్లతో కొమ్ము బురలతో ఉదుతూ సంబరాలు నిర్వహిస్తారు. మూడవ రోజు అర్ధరాత్రి జట్టీల కోటలోని ప్రధాన దర్వాజ ఎడమపట్టికి చెక్కి ఉన్న మైసమ్మ అమ్మవారి విగ్రహానికి పసుపు, కుంకుమతో పట్నం వేసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం మహిషాసురునికి బలి ఇచ్చి గుర్రపు, ఎనుగు బోమ్మలను సమర్పించి మొక్కులుగా చెల్లిస్తారు.

**నూతనంగా రోడ్లు ఏర్పాటు**

గతంలో గాంధారి ఖిల్లా గుట్ట, ఆలయానికి వెళ్లే దారి మట్టి రోడ్డుతో గుంతలమయం కావటంతో ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చొరవతో గాంధారి మైసమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిని రూ.2.10 కోట్లతో బొక్కలగుట్ట గ్రామం నుంచి గాంధారి ఖిల్లా ఆలయం వరకు బిటీ రోడ్డు నిర్మించారు.

**ఏర్పాట్ల పరిశీలన**

జాతర సంబందించిన ఏర్పాట్లను గురువారం సీఐ ప్రమోద్ రావు, ఎంపీడీఓ శశికళ పర్యవేక్షించారు. మూడు రోజుల పాటు జరుగు ఈ జాతరకు శాంతి భద్రత నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. వీరితో పాటు రామకృష్ణాపూర్ ఎస్సై బి.అశోక్, అగ్నిమాపక అధికారి, శానిటరి ఇన్‌స్పెక్టర్ వసంత్, ఏఎస్సై నూనె శ్రీనివాస్ పోలీస్ కానిస్టేబుల్ జంగు ఉన్నారు.

## న్యాయవాదులు నిత్య విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

న్యాయవాదులు ఎప్పటికప్పుడు నిత్య విద్యార్థులేనని జిల్లా జడ్జి రవీంద్ర శర్మ అన్నారు. బార్ అసోసియేషన్‌లో నూతన సభ్యుల చేరిక సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త అంశాలను నేర్చుకుంటూనే పాత అంశాలను వాటికి జోడించి కేసులలో వాదించాల్సి ఉంటుందన్నారు. న్యాయవాదిగా ఎదగాలంటే ఒక నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. అనంతరం నూతనంగా చేరిన కొంక హరీష్‌కు సభ్యత్వం అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, న్యాయవాదులు తాటిపల్లి సురేష్, దీపక్, ముక్త సురేష్, రజి హైదర్, జగన్ మోహన్‌రావు, రవీందర్, జైశ్యామ్, ప్రసాద్, శ్రీనివాస్, రామకృష్ణ, రాజీవ్‌రెడ్డి, చరణ్ తేజ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని చిన్న ధర్మారం గ్రామానికి చెందిన వివాహిత షేక్ నౌషిన్ బేగం, షేక్ శయన్ అనే రెండేండ్ల బాలుడు కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్సై గంగారాం తెలిపారు. చిన్న ధర్మారంకు చెందిన షేక్ షారూక్ బాబాకు భార్య నౌషిన్ బేగం, కుమారుడు శయాన్ ఉన్నారు. ఫిబ్రవరి 1న ఉదయం నెన్నెలకు కూలీ పని కోసం వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తన భార్య, కొడుకు ఇంట్లో కనిపించకపోవడంతో స్థానికంగా ఉన్న అందరినీ అడిగాడు. వరుసకు అత్త అయ్యే మహిళ దగ్గర నుంచి తన పుట్టింటికి వెళ్తా అని చెప్పి రూ.150 అడిగి తీసుకొని వెళ్లింది. కాని చెన్నూర్లోని తన పుట్టింటికి కూడా పోకపోవడంతో ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో భార్య, కొడుకు కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 03 ఫిబ్రవరి 2023



## పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ

**బజార్‌హత్నూర్ :** మండల కేంద్రంలోని పశువైద్యశాలను జిల్లా పశువైద్యాధికారి బి.కిషన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆసుపత్రి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించాలని సూచించారు. పశువులకు గడ్డి కొరత లేకుండా పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని తెలిపారు. అందుబాటులో ఉండి పశువులకు వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి పర్వీద్ హైమద్, సిబ్బంది పాల్గొన్నారు.



## కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-జైనూర్

కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం..లింగాపూర్ మండలానికి చెందిన జాదవ్ రవీందర్(40) కొన్ని రోజుల నుండి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నాడు. గత నెల 31న జైనూర్ మండలం చింతకర్ర గ్రామంలోని అత్తమ్మ ఇంటి నుండి బయటకు వెళ్లాడు. కడుపునొప్పి ఎక్కువ కావడంతో పురుగులమందు తాగాడు. 108లో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి జాదవ్ గణపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కూతురు ఉన్నారు.

## మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

మన ఊరు, మన బడి, మన బస్తీ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రూ.30లక్షల లోపు ఉన్న పనులన్నీ నెల రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పనుల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. పనులు జరిగిన వెంటనే వాటిని ఎంబిలో నమోదు చేయాలన్నారు. ప్రతి మండలంలోని మోడల్ పాఠశాలల్లో కిచెన్, గార్డెన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పూర్తిగా పనులు అయిపోయిన పాఠశాలల్లో పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటాలని, మైదానాలు చదును చేసి అందంగా తీర్చి దిద్దాలని పాఠశాల గోడలపైన ఆర్టిస్టులతో రంగు రంగుల ఆకర్షణీయమైన బొమ్మలు వేయించాలని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, పిల్లల్లో పరీక్షలంటే భయం పోయేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈఓ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పించాలని వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ గురువారం చైతన్య వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో వికలాంగులు అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయికి వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌ను వారు కలిసి తమ పరిస్థితి వివరించారు. ఉపాధి కోసం పేపర్ ప్లేట్లు, గ్లాసులు తయారు చేసే యంత్రాలను తమకు ఇప్పించాలని కోరారు. అదేవిధంగా కాగజ్‌నగర్‌లో తమకు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఒక భవనం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎండి ఖయ్యూం, సభ్యులు సప్తగిరి, అబ్దుల్ మజీద్, ప్రవీణ్, రమాకాంత్ పాల్గొన్నారు.

## సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - దహెగాం

సఖీ కేంద్రం సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గురువారం సఖీ కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని పీపీరావు కాలనీ, మండలంలోని కల్వాడ, కొంచవెల్లి, హత్తిని, మడహసపల్లి, పెద్ద తిమ్మాపూర్ గ్రామాల్లో సఖీ కేంద్రం సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సఖీ కేంద్రంలో వైద్యసేవలు, కౌన్సిలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి లాంటి ఐదు రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. మహిళలు హెల్ప్‌లైన్ కోసం 181 నెంబర్‌తో పాటు 8500240181 లేదా 8500785181 నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా సఖీ కేంద్రానికి నేరుగా రావొచ్చని పేర్కొన్నారు. యువతులకు 18 ఏండ్లు నిండకముందే బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలను ఎదుర్కోవడంతో పాటు చట్టపరంగా శిక్షలు భరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది కేస్ వర్కర్ మౌనిక, మల్టీపర్పస్ స్టాఫ్ మమత, రఘు, అంగన్‌వాడీ టీచర్‌పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి విన్నవించారు. డిగ్రీ కళాశాల లేక విద్యార్థులకు విద్య అందడం లేదని కళాశాల మంజూరయ్యాలని చూడాలని కోరారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై బడ్జెట్ కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## సమ్మక్క గద్దెలకు వనదేవతలు

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని కంకాలమ్మ ఆలయం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తులు గూడెం విమల, కొక్కెల జానకి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి గద్దెల వరకు అమ్మవార్లను ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, శివసత్తుల పూనకాలతో మొక్కులు చెల్లించారు. శివసత్తులు, భక్తులు అమ్మవార్లను వనం నుండి గద్దెలకు తీసుకొచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మరో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

## 8న జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 8న ఉదయం 11.30గంటలకు జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కేవీ. మునీశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ - జైనూర్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆశావర్కర్ల సమస్యలపై చర్చించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి అశోక్‌కు ఆశావర్కర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి ఉద్యోగ భద్రతకు భరోసా ఇవ్వాలని తెలిపారు. 2022, డిసెంబర్ 6 నుండి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి ప్రగతిభవన్‌లో ఆశావర్కర్లతో ప్రత్యేక సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చడం లేదని అసహనం వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు ప్రత్యేక రెస్ట్ గది ఇవ్వాలని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే ప్రభుత్వం భర్తీ చేసి ఆశావర్కర్ల పెండింగ్ బిల్లును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కరోనా కష్టకాలంలో నెలకు రూ.వెయ్యి ఇస్తామని చెప్పి 16 నెలలు అయినా నేటి వరకు ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు అర్చన, సునీత, శాంతాబాయి, మాన్కుబాయి, దుర్పతాబాయి పాల్గొన్నారు.

**బెజ్జూర్ :** నేటి నుండి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలోనైనా ఆశావర్కర్ల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సూపర్‌వైజర్ రేణుకకు ఆశా కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 26 వేల మంది ఆశావర్కర్లు పని చేస్తున్నారన్నారు. ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26వేలతో పాటు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022, డిసెంబర్ 6 నుండి నిర్వహించిన లెప్రసీ సర్వేకు ప్రభుత్వం అదనంగా డబ్బులు చెల్లించాలని, లెప్రసీ, కంటి వెలుగు పెండింగ్ డబ్బులు చెల్లించాలని, కరోనా కష్టకాలంలో రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా మండల నాయకులు సరోజ, వైశాలి, నాగమణి, లత, రాజేశ్వరి, సునీత, భాగ్య, బానుబాయి, శకుంతల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





**పెంచికల్‌పేట్ :** ఈ నెల 3 నుండి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి స్నేహ తస్లీమాకు ఆశా కార్యకర్తలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, సర్వేలకు, కంటి వెలుగుకు అదనంగా డబ్బులు చెల్లించాలని, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శ్రీలత, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

# ఉపాధి నిధుల కోతను నిరసిస్తూ బడ్జెట్ పత్రాల దహనం

నవతెలంగాణ-నిర్మల్

2023-24 బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధుల కోతను నిరసిస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు కోత పెడుతోందన్నారు. ఈ బడ్జెట్‌లో రూ.29వేల కోట్ల కోత విధించిందని, గత బడ్జెట్ కంటే ఈసారి తక్కువ నిధులు కేటాయించిందని విమర్శించారు. దీనివల్ల ఉపాధి హామీ కూలీలకు పని దొరికే పరిస్థితులు ఉండవన్నారు. పేదల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్‌లో పేదలని విస్మరిస్తోందని, సంపన్నులకు దోచిపెడుతోందని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇది మరీ చెత్త బడ్జెట్ అని విమర్శించారు. కార్పొరేట్లకు రూ.12లక్షల కోట్ల రుణాలను రద్దు చేయడం చూస్తే నరేంద్ర మోడీకి సంపన్నులపై ఉన్న ప్రేమ, పేదల పైన ఉన్న ద్వేషం కనబడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధి హామీకి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బి. సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జాన్‌పాల్ మోడపు, నల్ల అశోక్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ డి.పోశెట్టి పాల్గొన్నారు.



**ఆసిఫాబాద్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో..**

**ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దళితులకు ద్రోహం చేసే విధంగా ఉందని బడ్జెట్ ప్రతులను కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి నిధుల భారీగా తగ్గించడంతో పాటు జనాభా ప్రకారం దళితులకు నిధుల కేటాయింపులో బిజెపి ప్రభుత్వం ద్రోహం చేసిందని విమర్శించారు. దేశంలో దళితులు 20 శాతం ఉండగా సర్కార్ మాత్రం 16 శాతం నిధులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ నిధులు కూడా సక్రమంగా ఖర్చు చేయడం లేదన్నారు. బడ్జెట్ పత్రాలలో దళితుల కోసం అంకెలు పెంచుతున్నారని, కానీ నిధులు ఖర్చు చేయడం లేదన్నారు. గత బడ్జెట్ లో ఉపాధి హామీ చట్టానికి 89400 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్ లో 60000కోట్లు తగ్గించి దళితులకు అన్యాయం చేసిందన్నారు. మొత్తం సంక్షేమ పథకాలను ఎత్తివేస్తున్న ప్రభుత్వం దళితుల ఆర్థిక అభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో చెప్పాలన్నారు. దళితుల కీలక ఉపాధి వనరుగా ఉన్న జాతీయ గ్రామీ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే విధంగా 2021 నుండి క్రమంగా తగ్గిస్తూ ఈ బడ్జెట్లో 60 వేల కోట్లకు తగ్గించడం దళితుల ఉపాధిని దెబ్బతీయటమేనన్నారు. విద్య వైద్యం ఉపాధి ఇండ్ల స్థలాలు తాగునీరు వంటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులు చేయలేదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి రాబోయే 20 ఏళ్ల కాలంలో పేదలు లేని దేశంగా మారుస్తామని ప్రకటించిన పద్ధతులు ఈ 8 ఏళ్ల కాలంలో దళితుల పేదరికాన్ని పోగొట్టే సమగ్ర విధానం ఏముందో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు జాడి మల్లయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, కేవీపీయస్ జిల్లా నాయకులు డొంగ్రి మహేష్, ఇప్ప ప్రసాద్, వడ్లూరి గణేష్ పాల్గొన్నారు.





# 6న హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

**జైనూర్ :** ఈ నెల 6న మండల కేంద్రంలో మార్కెట్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్ అన్నారు. గురువారం మార్కెట్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జన్మదినం సందర్భంగా జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కోవ లక్ష్మి పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం అనుభవజ్ఞులైన పిల్లల వైద్యులు, గైనకాలజిస్టు, రేడియాలజిస్టుతో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వైద్యశిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సిర్పూర్(యు) జెడ్పీటీసీ, కోవ లక్ష్మి పౌండేషన్ చైర్మన్ కోవ అరుణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, జైనూర్ మండల వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, నేతకానీ రాష్ట్ర కన్వీనర్ జాడి రవీందర్, స్థానిక సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, బీఆర్ఎస్ సీనియర్ యువ నాయకుడు మెస్రం అంబాజీ, పెందూర్ లచ్చు, సిర్పూర్(యు) మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

# భక్తిభావంతో మానసిక ప్రశాంతత : కోనప్ప

నవతెలంగాణ - కౌటాల

భక్తిభావం కలిగిన వారికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం మండలంలోని తాటిపెల్లి గ్రామ సమీపంలోని కుర్త వద్ద గల శ్రీ శివసిద్ధి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పల్లకి ఊరేగింపులో పాల్గొని ఆలయంలో హనుమాన్, నంది, నవగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజూవారీ దినచర్యలో భాగంగా భక్తిభావం కలిగి ఉండడం ఒక భాగమన్నారు. భక్తిభావం కలిగి ఉండడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు మంచి అలవాట్లు, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎలుములె దత్తు ఆధ్వర్యంలో కోనప్పను కమిటీ సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు.

**రాష్ట్రం ఏర్పడ్డాకే రోడ్లు అభివృద్ధి**



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని తలోడి నుండి ధనోర్‌హెట్టి వరకు ఎల్‌డబ్ల్యుఈ రూ.కోటితో మంజూరైన బీటీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి రావడానికి రోడ్డు సౌకర్యం అయిందని, మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు పక్కా రోడ్లు అయినట్టు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లోని అంతర్గత రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మార్చినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాలను అభివృద్ధి చేయడంలో ప్రత్యేక దృష్టి సారించారన్నారు. చింతలమానెపెల్లి మండలం గూడెం వద్ద ప్రాణహిత నదిపై వంతెన నిర్మాణంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సాకు రవాణా సౌకర్యం సులభతరమైనట్టు తెలిపారు. త్వరలోనే కౌటాల మండలం గుండాయిపేట్ వద్ద వార్ధా నదిపై వంతెన నిర్మాణం చేయనున్నట్టు, దానికి ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించి ఉన్నారని తెలిపారు. ఈ వంతెన పూర్తయితే తెలంగాణ, మహారాష్ట్రలోని నందివర్ధన్ మీదుగా చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాకు రవాణా సులభతరం అవుతుందన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన తోకల గంగారాం(43) బుధవారం సముందర్‌పల్లి శివారులోని గోదావరి నదికి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో గురువారం గోదావరి నది తీర ప్రాంతానికి వెళ్లి గాలించగా సదరు వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం(ఎపి01ఎల్ 0275), చెప్పులు, బట్టలు గోదావరి తీర ప్రాంతంలో కనిపించాయి. గజ ఈతగాళ్ల సాయంతో నదిలో గాలిస్తున్నారు. భార్య తోకల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భీంరావ్ తెలిపారు.

## సింగరేణి కార్మికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ - రెబ్బెన

గోలేటి నుండి మంచిర్యాలకు సింగరేణి కార్మికులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ కేంద్రె కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలో జీఎం జి దేవేందర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, కన్వెన్స్ డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారందరూ రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని రోజుల క్రితం మంచిర్యాల నుండి గోలేటికి బస్సును నిలిపేశారని, దీన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. బస్సు రద్దుతో గోలేటి నుండి మంచిర్యాలకు వెళ్లే కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వికలాంగులు సరైన సమయంలో ఆస్పత్రికి వెళ్లలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయికిరణ్, కన్వెన్స్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఇరురపు సంతోష్, డ్రైవర్లు దుర్గం శ్రీనివాస్, అశోక్, దిలీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్‌పై అసత్య ఆరోపణలు అసమంజసం

నవతెలంగాణ-నిర్మల్

టీఎస్‌యూటీఎఫ్‌పై అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్‌లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల టీయూటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు రవి కిరణ్, అలాగే పలు సంఘాల ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో చేరారని తెలిపారు. ఇది పడని కొన్ని సంఘాలు ఆరోపణలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. చేరిన ఉపాధ్యాయులపై కక్షపూరితమైన చర్యలు తీసుకుంటామని బెదిరించడం జరుగుతుందని, ఇది పూర్తిగా అప్రజాస్వామికని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఏ ఉపాధ్యాయుడైన ఏ సంఘంలోనైనా సభ్యత్వాన్ని తీసుకోవడానికి వీలుందని తెలిపారు. అంతే కానీ కొంతమంది ఉపాధ్యాయ సంఘం నాయకులు అనవసరమైన ఆరోపణలు చేస్తూ చేరిన ఉపాధ్యాయులపై బెదిరింపులకు పాల్పడడం తీవ్రమైన చర్యని తెలిపారు. అలాంటి ఆరోపణలను మానుకోవాలని హెచ్చరించారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలే తమ సంఘం ముఖ్య ఉద్దేశ్యమని వెల్లడించారు.

## రేపటి నుండి ఎడ్‌బిడ్ మల్లన్న దేవుని జాతర

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ మల్లన్న దేవుని జాతర శనివారం నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ, గ్రామస్తులు తెలిపారు. ఈ జాతర 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ నెల 4న రాత్రి శ్రీమల్లన్న దేవుని కళ్యాణ మహోత్సవం, 5న చల్లని అంబళ్లు, 6న దేవుని పల్లకి ఊరేగింపు, 7న కుస్తీ పోటీలు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, సుమారు రూ.లక్షతో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం మల్లయోధులు తరలివస్తారు.డ ఫైనల్ కుస్తీ పోటీల్లో ఫైనల్ విజేతకు 10 వేల నగదు. 50 గ్రాముల వెండికడియం, రెండవ విజేతకు 5వేల నగదు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 8న అడపడుచుల జాతర, అంబలి కుండా ఇంటికి తేవడంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు బైంసా నుండి ప్రత్యేక బస్సులు నడుప బడుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ గ్రామంలో ప్రతి సంవత్సరం దేవుని కళ్యాణం జరిగిన తర్వాతనే గ్రామంలో పెండ్లి కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

## ఉచిత పశు వైద్యశిబిరం

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కమాన గ్రామంలో గురువారం పాడి పశువులకు అనారోగ్యం, గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ పశువులను పాడి ప్రదేశంలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. రోజుకు ఒకసారైనా వేపాకులతో పశువులు ఉండే ప్రదేశంలో పొగ పట్టించాలని, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పశు వైద్యాధికారులను సంప్రదించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ పవన్, ఎంపీటీసీ ప్రవీణ్, మండల పశు వైద్య సిబ్బంది సునీల్, గణపతి, రాజీవ్, నరేష్, వినోద్, రైతులు పాల్గొన్నారు.



## సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ నుండి బహిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ నుండి కాగజ్‌నగర్‌కు చెందిన ఎండి అన్వర్‌ను బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలకు పలు ఆటంకాలు కల్పిస్తున్న అన్వర్‌ను పార్టీ మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.